
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
సోమవారం 17 జూన్ 2024



నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, జూన్ 16 : ఆమనగల్లులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్వో ఎంఏ పాషా ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్ క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రిల సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ఐఓఎల్ ఆపరేషన్లు చేయిస్తామని ఆయన తెలిపారు. ఆమనగల్లు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బక్రీద్'కు ఈద్గాల ముస్తాబు



ఈద్గా వద్ద ఏర్పాట్లు చేస్తున్న మజీద్ కమిటీ సభ్యులు

కడ్తాల్, జూన్ 16: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగకు కడ్తాల, మండలంలోని గ్రామాల్లో మజీద్ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఏటా బక్రీద్ వేడుకను ఈ ప్రాంతంలో ఘనంగా నిర్వహిస్తారు. సోమవారం నిర్వహించే బక్రీద్ వేడుకలకు మజీద్ కమిటీలు తగిన ఏర్పాట్లు చేశాయి. కడ్తాలలోని ఈద్గా వద్ద ఆదివారం మజీద్ కమిటీ సభ్యులు పిచ్చిమొక్కలను తొలగించారు. నేటి ఉదయం 8:30గంటలకు ఈద్గా వద్ద నమాజ్ ప్రారంభం అవుతుందని మజీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు జావేద్ తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు జహంగీర్ అలీ, యూనుస్, హనీష్, మోహిన్, అతిక్, షబాజ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌పై ఉన్నతాధికారుల పరిశీలన

- చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరిక



చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

చేవెళ్ల, జూన్ 16: చేవెళ్లలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని తెలంగాణ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. శనివారం రాత్రి ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో షార్ట్‌సర్క్యూట్ జరిగిన నేపథ్యంలో అగ్ని ప్రమాదం జరిగిన గదిని కమిషనర్ పరిశీలించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలపై డీసీహెచ్‌వో రాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సోమశేఖర్, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డును పునరుద్ధరించి డయాలసిస్ సేవలందించాలని ఆదేశించారు. ఆస్పత్రికొచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. రోగుల పట్ల ప్రేమగా మాట్లాడాలని నర్సులకు తెలిపారు. ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరిగితేనే మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవకాశముంటుందన్నారు. ఆసుపత్రిలో ప్రతీ నెల కాన్పుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. గైనకాలజిస్టు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌వోను ఆదేశించారు. రాత్రిపూట సైతం వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. డ్యూటీ డాక్టర్ స్థానంలో ప్రైవేట్ వైద్యులు విధులు నిర్వహిస్తున్నట్లు తమకు తెలిసిందని, అలాంటి వైద్యులు పద్ధతి మార్చుకోకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లెక్కలు తేలేనా?

జిల్లాలో టీచర్ల బదిలీలు, పదోన్నతులకు మోక్షం కలిగేనా?

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ జిల్లాలో షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందా? లేదా? అనే సందిగ్ధత నెలకొంది. స్థానికత ఆధారంగానే జిల్లాలో ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు చేపట్టాలని జిల్లాకు చెందిన టీచర్లు, సంఘాల నాయకులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి విలీనమైన పది మండలాల ఉపాధ్యాయులను, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని కలుపుకొని సీనియార్టీ ప్రాతిపదికన బదిలీలు, పదోన్నతులు చేపడితే సొంత జిల్లా వారికి అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో స్థానికేతర ఉపాధ్యాయుల సంఖ్య 45శాతానికి మించిందని, ఈ నేపథ్యంలో సీనియార్టీ ప్రాతిపదిక కాకుండా స్థానికత ఆధారంగానే అన్ని జిల్లాలతో పాటే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.





టీచర్ల బదిలీలపై అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నిరుద్యోగులు(ఫైల్)



- పునర్విభజనలో 317జీవో కింద ఉపాధ్యాయుల సర్దుబాటు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ పది మండలాల విలీనంతో సమస్య
- స్థానికతను పక్కనబెట్టి సీనియార్టీకి పెద్దపీట వేస్తే అన్యాయం
- క్యాడర్ స్ట్రెంత్‌కు మించి ఉపాధ్యాయుల రాకతో ఇబ్బందులు
- జిల్లాలో ఇప్పటికే 45శాతానికి మించిన నాన్ లోకల్ టీచర్లు
- క్యాడర్ స్ట్రెంత్ తేల్చి బదిలీలు చేపట్టాలని సంఘాల డిమాండ్

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూన్ 16) : రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ క్రమంలో తమకు కూడా ప్రమోషన్ వస్తుందని, బదిలీ అవుతుందని ఆశపడ్డ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల కోరిక నెరవేరేలా కనిపించడం లేదు. జిల్లాల పునర్విభజనలో గత ప్రభుత్వం 317 జీవో ద్వారా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. ఈ సందర్భంలో స్థానికతను పరిగణలోకి తీసుకోకుండా సీనియార్టీకి పెద్దపీట వేయడంతో చాలామంది జూనియర్ ఉపాధ్యాయులు సొంత జిల్లాను వీడి వేరే జిల్లాలకు వెళ్లారు. కొత్త జిల్లాలైన సమయంలో క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పది మండలాలను రంగారెడ్డి జిల్లాలో విలీనం చేశారు. ఇప్పుడు ఇదే అసలు సమస్యగా మారింది. జిల్లాకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి క్యాడర్(ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య) స్ట్రెంత్‌కు మించి టీచర్లు రావడంతో తమకు అన్యాయం జరుగుతోందని కొంతమంది ఉపాధ్యాయులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ తరుణంలో కేడర్ స్ట్రెంత్ సంఖ్య తెలియనంత వరకు రంగారెడ్డి జిల్లాకు బదిలీలు పదోన్నతులు జరుపకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలో స్థానికేతర ఉపాధ్యాయుల సంఖ్య 45శాతానికి మించిపోవడం, అలాగే క్యాడర్ స్ట్రెంత్‌కు మించి ఉపాధ్యాయులు రావడంతో జిల్లాలోని నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. క్యాడర్ స్ట్రెంత్ లెక్కలను త్వరగా తేల్చి ఈ షెడ్యూల్‌లోనే అన్ని జిల్లాల మాదిరిగానే రంగారెడ్డి జిల్లా టీచర్ల కూడా పదోన్నతులు బదిలీలు నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు జిల్లా కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డిలను కలిసి విన్నవించారు. జిల్లాకు అక్రమ బదిలీల ద్వారా, క్యాడర్ స్ట్రెంత్‌కు మించి కేవలం 103 మంది టీచర్లే వచ్చారని జిల్లా విద్యాశాఖ అధికారి లెక్కలు చూపిస్తున్నారు. కానీ 250కిపైగా అదనంగా టీచర్లు వచ్చి చేరారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తేనే బదిలీలు పదోన్నతులు జరిగే పరిస్థితి నెలకొంది. అవసరానికి మించి జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులను వెనక్కు పంపిస్తారా? లేక సూపర్ న్యూమరరీ పోస్టులు క్రియేట్ చేస్తారా? లేక మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పోస్టులను బదిలీ చేస్తారా? అనే అంశాల్లో స్పష్టత రావాల్సి ఉన్నది.

షెడ్యూల్ ప్రకారమే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



ప్రభుత్వం విడుదల చేసిన బదిలీలు పదోన్నతుల షెడ్యూల్‌లోనే జిల్లా ఉపాధ్యాయులకు కూడా పదోన్నతులు కల్పించాలి. అధికారులు క్యాడర్ స్ట్రెంత్ లెక్కలను త్వరగా తేల్చి ఈ ప్రక్రియకు మార్గం సుగమం చేయాలి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈ ప్రక్రియ పూర్తవుతుండడంతో తదుపరి ఆలస్యంగా చేపడితే టీచర్లకు అన్యాయం జరుగుతుంది. దొడ్డిదారి బదిలీలను నివారించి జిల్లా నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయ సంఘాలకు బాసటగా నిలవాలి. జిల్లా అస్థిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

- ఏవీ.సుధాకర్, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

జిల్లాకు తీరని అన్యాయం జరిగింది



రంగారెడ్డి జిల్లాకు ఇప్పటికే తీరని అన్యాయం జరిగింది. స్థానికేతరుల కోటా పరిమితికి మించిపోయింది. గత సంవత్సరం విడుదల చేసిన 317జీవోతో చాలా మంది రంగారెడ్డి స్థానికత కలిగిన ఉపాధ్యాయులు వికారాబాద్ జిల్లాకు వెళ్లారు. ఇతర జిల్లాల నుంచి అలకేషన్లో తప్పులు జరిగిందని కోర్టు ఉత్తర్వులు తెచ్చుకుని రంగారెడ్డి జిల్లాకు అక్రమంగా సుమారు 200మందికి పైగా ఉపాధ్యాయులు వచ్చారు. దీనివల్ల క్యాడర్ స్ట్రెంత్ దెబ్బతిని స్థానిక ఉపాధ్యాయులకు పదోన్నతులు రావడం లేదు. ఈ సమస్య మీద కోర్టుకు వెళ్లడం వల్ల అన్ని జిల్లాల్లో పదోన్నతులు బదిలీలు ప్రారంభమైనా రంగారెడ్డి జిల్లాలో మాత్రం ఆగిపోయాయి. దీనివల్ల భవిష్యత్తులో మల్టీ జోన్-2 లో ఉన్న ఉపాధ్యాయులతో సీనియారిటీ లిస్టు తయారు చేస్తే రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయులు వెనుకబడే ప్రమాదం ఉంది. ఈ షెడ్యూల్లోనే రంగారెడ్డి జిల్లాలోనూ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.

- పి.రఘునందన్‌రెడ్డి, టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అవకతవకలపై తక్షణమే విచారణ జరిపించాలి



ఉపాధ్యాయ బదిలీల్లో స్థానిక, స్థానికేతర అంశంలో జరిగిన అవకతవకలపై వెంటనే విచారణ జరిపించాలి. నిబంధనలకు విరుద్ధంగా మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, మంచిర్యాల, యాదాద్రి, సంగారెడ్డి వంటి జిల్లాల నుంచి ఉపాధ్యాయులు జిల్లాకు వచ్చారు. ప్రభుత్వ ఆర్డర్లతో, స్పౌస్ పేరుతో విరుద్ధ పోస్టుల పేరుతో స్థానిక నిరుద్యోగులకు చెందాల్సిన ఖాళీలను స్థానికేతరులతో నింపారు. పరస్పర బదిలీలు చేసినప్పుడు కూడ నింబంధనలు పాటించలేదు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంది. 400కుపైగా ఉపాధ్యాయ ఖాళీలను స్థానికేతరులతో భర్తీ చేశారు. స్థానిక, స్థానికేతర అంశాన్ని వెంటనే తేల్చాలి.

- బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

టీచర్ల బదిలీలకు జిల్లా విద్యా శాఖ వద్ద ఉన్న లెక్కలు ఇవీ ..

హోదా	పోస్టుల మంజూరు	పనిచేస్తున్న వారు	టీచర్ల ఖాళీలు	జీవో 317 అభ్యర్థనలు	అంతర్ జిల్లా స్పౌస్ బదిలీలు	అంతర్ జిల్లా బదిలీలు	ఎక్సెస్
గ్రేడ్-2 హెడ్మాస్టర్	220	204	16	0	0	4	4
పీఎస్‌హెచ్‌ఎం(తెలుగు)	157	91	66	0	1	0	1
ఎస్‌ఏ మాథ్స్	473	468	5	6	2	2	10
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	384	380	4	4	0	1	5
ఎస్‌ఏ బయోసైన్స్	414	368	46	4	8	1	13
ఎస్‌ఏ సోషల్	440	343	97	5	6	1	12
ఎస్‌ఏ(తెలుగు)	176	163	13	2	8	0	10
ఎస్‌ఏ(హిందీ)	111	104	7	0	6	0	6
ఎస్‌ఏ(ఇంగ్లీష్)	416	399	17	4	2	2	8
ఎస్‌ఏ(ఉర్దూ)	8	4	1	0	0	0	0
ఎస్‌ఏ(పీఈటీ)	36	34	2	8	1	1	10
ఎల్‌పీ(తెలుగు)	277	259	18	2	0	0	2
ఎల్‌పీ(హిందీ)	239	228	11	1	0	0	1
ఎల్‌పీ(ఉర్దూ)	4	3	1	0	0	0	0
పీఈటీ(తెలుగు)	101	95	6	0	0	2	2
ఎస్జీటీ(తెలుగు)	2,787	2,579	208	12	0	5	17
ఎస్జీటీ(ఉర్దూ)	138	138	0	2	0	0	2
ఎస్జీటీ(ఇంగ్లీష్)	147	147	0	2	0	0	2
మొత్తం	6,525	6,007	518	50	34	19	103



నానక్‌నగర్‌లో వాడిన పత్తి మొలకలను పరిశీలిస్తున్న మహిళా రైతు

వాడుతున్న పత్తి మొలకలు

- కలవరపడుతున్న రైతులు

యాచారం, జూన్ 16 : మండలంలో 16 రోజులుగా వర్షాలు కురియ లేదు. అంతకు ముందు కురిసిన వర్షాలకు గ్రామాల్లో 1,500 ఎకరాల్లో పత్తి విత్తారు. అయితే వానల్లేక రైతుల ఆశలపై నీళ్లు చల్లే విధంగా పరిస్థితి తయారైంది. భూమిలో తేమ లేక పత్తి మొలకలు వాడుతున్నాయి. చౌదర్‌పల్లి, మేడిపల్లి, నానక్‌నగర్, తమ్మలోనిగూడ, కొత్తపల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో పత్తి విస్తారంగా సాగు చేశారు. అయితే వానల్లేక పత్తి విత్తనాలు భూమిలోనే ఉండి పోయాయి. మొలిచిన మొలకలూ వాడుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో వర్షాలు పడకుంటే మొలకలు కూడా ఎండిపోతాయని, విత్తులు బుడ్డిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఐదెకరాల్లో పత్తి పెడితే రూ.20వేల ఖర్చయింది



నేను ఐదు ఎకరాల్లో పత్తి వేశాను. ఇప్పటికి రూ.20వేలు ఖర్చుచేశాను. 16 రోజులుగా వర్షాలు పడలేదు. అకడక్కడ మొలకలు మొలిచాయి. కొన్ని చోట్ల విత్తనాలు ఇంకా భూమిలోనే ఉన్నాయి. అవి బడ్డిపోయి మొలకెత్తుతాయనే నమ్మకం లేదు. మొలకలూ వాడిపోతున్నాయి. మమ్మల్ని ఆ వానదేవుడే ఆదుకోవాలి.

- బర్ల మల్లేష్, రైతు, నానక్‌నగర్

ఈసారైనా తీరుస్తారా?

'ధరణి' సమస్యల పరిష్కారానికి రెండోసారి కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

- పట్టా భూములున్నా అందని పాస్‌బుక్‌లు
- పథకాలకు నోచుకోలేకపోతున్న రైతులు




యాచారం తహసీల్దార్ కార్యాలయం

యాచారం, జూన్ 16 : ధరణి పోర్టల్‌లో అపరిష్కృతంగా ఉన్న రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెండోసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. మండలంలోని 24 పంచాయతీల్లో 2,550 భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. పోర్టల్‌లో భూ సమస్యలు పరిష్కరించి పాస్‌బుక్‌లు అందించేందుకు గత మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించినా ఏ ఒక్క సమస్యా తీర్చలేదు. టీఎం 33 మాడ్యూల్లో 1,557 సమస్యలున్నా పరిష్కరించలేదు. పేరుకే స్పెషల్ డ్రైవ్ తప్ప చేసేదేమీ లేదని రైతులు మండిపడుతున్నారు. 'ధరణి'లో భూ వివరాలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆర్డీవో, కలెక్టర్ తమ లాగిన్లతో సరిచేసి సీసీఎల్‌ఏకు పంపుతున్నారు. అయితే సీసీఎల్‌ఏ మాత్రం కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల అప్రూవల్ రికార్డులను చూడకుండానే రిజెక్ట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. కొందరు రైతుల సమస్యలను పరిశీలిస్తే.. మల్కీజ్‌గూడ పరిధిలో బూడిద వెంకటయ్యకు 354 సర్వే నంబర్‌లో 2ఎకరాల పట్టా భూమి ఉంది. అయితే 38గుంటలకే పాస్‌బుక్ వచ్చింది. మిగిలిన ఎకరం 12గుంటలనూ ఆయన రికార్డులో ఎక్కించొచ్చని తహసీల్దార్, ఆర్‌ఐ, ఆర్డీవో, కలెక్టర్ అప్రూవ్ చేసి సీసీఎల్‌ఏకు పంపితే అక్కడి అధికారులు పాస్‌బుక్ ఇవ్వడం లేదు. తనకు పట్టా భూమి ఎలా సంక్రమించిందో రికార్డులను సీసీఎల్‌ఏకు పంపినా పట్టించుకోవడం లేదని రైతు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. తన భూమి పోర్టల్‌లో చూపకపోవడంతో రైతుబంధు, ఇతర ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు రుణం వంటివి కోల్పోతున్నానని రైతు వాపోతున్నాడు. ఇలాంటి సమస్యే చాలా మంది రైతులది. యాచారానికి చెందిన గోపాల్‌రెడ్డికి తాతల కాలం నాటి ఐదెకరాల పట్టా భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో ఇది భూదాన్ భూమిగా మారింది. మంతన్‌గౌరెల్లికి చెందిన కెతావత్ మంగ్లాకు సర్వే నంబర్ 54లో ఉన్న 6 ఎకరాల పట్టా భూమినీ భూదాన్ భూమిగా మార్చారు. రైతు మూడేళ్లుగా కలెక్టర్, సీసీఎల్‌ఏల చుట్టూ తిరుగుతున్నా భూదాన్ బోర్డ్ నుంచి ఎన్‌వోసీ తెచ్చుకుంటే సరి చేస్తామంటున్నారు. అలాగే యాచారానికి చెందిన జనార్ధన్‌రెడ్డికి 77, 78 సర్వే నంబర్లలో 25ఎకరాల వారసత్వ పట్టా భూమి ఉంది. ఈ భూమి ధరణి పోర్టల్‌లో భూదాన్ భూమిగా నమోదు చేశారు. రిటైర్డ్ ఏసీపీ రవీందర్‌రెడ్డికి 72, 73, 74 సర్వే నంబర్లలో ఉన్న 34 ఎకరాల పట్టా భూమి సైతం భూదాన్ భూమిగా నమోదు చేశారు. ధర్మన్నగూడలోని చాలా మంది రైతుల పట్టా భూములను భూదాన్ భూములుగా రికార్డు చేశారు. పట్టా భూములను భూదాన్‌గా ఎలా మార్చారని అధికారులను రైతులు అడిగితే ఈ విషయం మీరు భూదాన్ బోర్డ్ వద్దే తేల్చుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చి పంపుతూ ముప్పు తిప్పలు పెడుతున్నారు.

అవే పాత సమస్యలు

ధరణిలో భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మొదటి దఫా స్పెషల్ డ్రైవ్‌లో ఉన్న సమస్యలే రెండో దఫాలోనూ ముందుకొస్తున్నాయి. రెండో దఫాలోనూ తమ సమస్యలు తీరతాయనే నమ్మకం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులే ధరణిలో తప్పుడు రికార్డులు నమోదు చేసి కలెక్టర్, సీసీఎల్‌ఏ, భూదాన్ బోర్డ్‌లను అడగాలంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది గ్రామంలో తిరిగి పహాణి ఆధారంలో విచారణ చేయకుండానే వివరాలను ధరణిలో అప్‌లోడ్ చేయడం వల్లే తిప్పలొచ్చాయి. ధరణి సమస్యలన్నీ పరిష్కరించి భూ మాత పోర్టల్‌ను తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంది. అయితే పాత సమస్యలు తీరవు.. కొత్త పోర్టల్ రాదని రైతులు వాపోతున్నారు.

నా గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలుస్తలేదు



నా పట్టా భూమి ధరణిలో భూదాన్ భూమిగా మార్చారు. నేను యుక్త వయసులో రిక్షా తొక్కి పైసాపైసా కూడబెట్టి ఊర్ల రెడ్ల వద్ద భూమి కొన్నా. ధరణి వచ్చినంక నా పట్టా భూమిని భూదాన్ భూమిగా మార్చిన్రు. నాకు ఇంత వరకు రైతుబంధు చిల్లిగవ్వ రాలే. కలెక్టర్ దగ్గరికి పోయినా నా సమస్య పరిష్కరించలేదు. ఆపదుండి భూమి అమ్ముకుందామన్నా అమ్మకుండా రికార్డులు మార్చడం అధికారులకు ఎంత వరకు న్యాయం?

- మంగ్లానాయక్, రైతు, మంతన్‌గౌరెల్లి

ఏటి కాల్వ మరమ్మతులు ఎన్నడో..?

బొంరాస్‌పేట్, జూన్ 17: బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు ప్రధాన ఆయువు ఏటికాల్వ. ఈ ఏటికాల్వ గతేడాది వర్షాకాలంలో తెగి పోయి గండిపడినా ఎవరూ పట్టించుకోలేదు. గత వర్షాకాలంలో బొంరాస్‌పేట్ పెద్దచెరువు నిండిన అనంతరం ఈ గండి పడింది. చెరువు నిండటంతో రైతులు ఈగండి పూడ్చేందుకు ముందుకురాలేదు. సంవత్సరం గడుస్తున్నా నేటికీ ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటి వరకు బొంరాస్ పేట్ పెద్ద చెరువు ఏటి కాల్వ, పాటు కాల్వ, పొలాలకు నీరు వెళ్లే కాల్వలను రైతులు చందాలు వేసుకొని స్వచ్ఛందంగా మరమ్మ తులు చేసుకోవడమే తప్ప ప్రభుత్వం నుంచి సహకారం అందడం లేదు. దశాబ్ద కాలం ఏటి కాల్వ మరమ్మతులకు రూ.కోటి మంజూరు కాగా తిరిగి సాయం అందలేదు. ఐదు సంవత్సరాల కిందట ఈకాల్వను ఎవరూ పట్టించుకోకపోవడంతో అప్పుడే బొంరాస్‌పేట్‌కు సర్పంచ్‌గా ఎన్నికైన కోపూరి విజయమ్మ కుమారులు సంతోష్, వీరేశంలు తమ సొంత నిధులతో ఏర్పుమళ్ల కాకరవాణి ప్రాజెక్టు నుంచి బొంరాస్‌పేట్ పెద్దచెరువు వరకు దాదాపు 5 కిలోమీటర్ల కాల్వను పూడిక తీయించారు. ఈ పూడిక తీయడంతో నాలుగు సంవత్సరాలు వరుసగా చెరువు నిండటంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకున్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో ఈ ఏటి కాల్వకు గండిపడినా ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి దృష్టికి రైతులు తీసుకెళ్లారు. వర్షా కాలం సమీపించడంతో భారీగా వర్షాలు కురిస్తే పైనుంచి వరదనీరు వృథాగా కాకర వాణి ప్రాజెక్టులోకి వెళ్తుంది. ఇప్పటికైనా రైతులపై ప్రత్యేక దృష్టి సారించి ఇరిగేషన్ అధికారులు ఏటి కాల్వ గండిని పూడ్చాలని బొంరాస్‌పేట్ రైతులు కోరుతున్నారు


ఏటి కాల్వకు పడిన గండి, అడ్డుగా మట్టి కట్టలు, పిచ్చి మొక్కలు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఏస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో' మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

వీవోఏలను వేధిస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

- సెర్ప్ సీఈవోకు బాధితుల ఫిర్యాదు



సెర్ప్ సీఈవోకు ఫిర్యాదు చేస్తున్న వీవోఏలు

చౌదరిగూడ, జూన్ 16: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న రామస్వామి మహిళ వీవోఏలను వేధిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని గత శుక్రవారం వీవోఏ ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్ సెర్ప్ సీఈవో అనితా రామచంద్రన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం మాట్లాడుతూ ఏపీఎం రామస్వామి మహిళ వీవోఏలను వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో కూడా రామస్వామిపై ఇలాంటి ఆరోపణలు రావడంతో తాము సంఘం తరఫున మందలించామని, ఆయన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామస్వామి మహిళా వీవోఏలకు ఫోన్‌చేసి అసభ్యకర పదజాలంతో మేసేజ్‌లు పంపుతున్నారని, దీనివల్ల వారి కుటుంబాల్లో సమస్యలు వస్తున్నాయని ఫిర్యాదు పేర్కొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఏపీఎం రామస్వామిని విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కాగా, రామస్వామి మహిళా వీవోఏలకు చేసిన మెసేజ్‌లు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతుండటంతో ప్రజా సంఘాల నాయకులు, మహిళా సభ్యులు రామస్వామిని వెంటనే సస్పెండ్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కాగా, రామస్వామి ఇంతకుముందు మాడ్గుల మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహించేవాడని ఆయన చెప్పారు. సీఈవోకు ఫిర్యాదు చేసిన వారిలో రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి, కోశాధికారి తిరుపతి, చంద్రశేఖర్, అరుణ, జానకి, మహేశ్వరి, మాధవి, రమ్యశ్రీ, అమృత, సుధాకర్, చిత్కలా, సుమిత్ర, నస్రీన్, అమరావతి, శిరీష తదితరులు ఉన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు

- రూ.80 వేలు, 3 కార్లు, స్కూటీ స్వాధీనం
- పోలీసుల అదుపులో 15 మంది నిందితులు
- ఒకే ఇంట్లో రెండుసార్లు దోపిడీకి విఫలయత్నం
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న వస్తువులు

ఆదిభట్ల, జూన్ 16 : దోపిడీ దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి నగదు, కార్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అబ్దుల్లాపూర్ మండలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నివసిస్తున్న చెన్నైకి చెందిన వ్యాపారి తిరుమన తురై ఇంట్లో ఈనెల 11న చోరీకి ప్రయత్నించిన కేసును ఆదిభట్ల పోలీసులు ఛేదించారు. ఈ కేసుతో సంబంధమున్న 15మంది నిందితులను అరెస్టు చేశారు. మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సమక్షంలో ఆదిభట్ల ఎస్‌ఎచ్‌వో రాఘవేందర్‌రెడ్డి నిందితులను ఆదివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. డీసీపీ మాట్లాడుతూ ఈనెల 11న తుర్కయంజాల్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో నివాసముండే చాక్లెట్ తయారీ సంస్థ వ్యాపారి తిరుమన తురై ఇంటివద్ద దుండగులు వాచ్‌మ్యాన్‌ను కొట్టి.. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ప్రధాన ద్వారం పగులగొట్టి ఇంట్లోకి ప్రయత్నించారు. గమనించిన వ్యాపారి కుమార్తె డయల్ 100కు కాల్‌చేసి ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసు సైరన్ శబ్దం విని దుండగులు పారిపోయారు. అయితే, వారు వెళుతూ వెళుతూ వాచ్‌మ్యాన్ సెల్ ఫోన్ లాక్కొని పారిపోయారు. తిరుమన తురై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. డీసీపీ పర్యవేక్షణలో ఏసీపీ ఆధ్వర్యంలో ఆదిభట్ల ఎస్‌ఎచ్‌వో రాఘవేందర్ రెడ్డి స్పెషల్ టీమ్‌ను ఏర్పాటుచేసి దర్యాప్తు చేసేక్రమంలో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బేకరీలో సమావేశం అయిన నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకొని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు.

రూ.950 కోట్ల బ్లాక్‌మనీ ఉందని స్కెచ్!

హయత్‌నగర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి బోగిని జంగయ్యకు డ్రైవర్ శేఖర్‌రెడ్డి, ఇసుక వ్యాపారం చేసే ఎండీ షైమూద్ అనే స్నేహితులున్నారు. వారంతా వ్యాపారాల్లో నష్టాలపాలై తుర్కయాంజాల్‌లోని టీషాప్ దగ్గర తరచూ కలుస్తూ ఉండేవారు. ఈక్రమంలో ఏదైనా చట్ట వ్యతిరేక పనులు చేసి డబ్బులు సంపాదించాలని నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో తిరుమన తురై ఇంట్లో రూ.950 కోట్లు నల్లధనం ఉన్నట్లు.. వ్యాపారి ఇంట్లో గతంలో వాచ్‌మ్యాన్‌గా పనిచేసిన వ్యక్తి ద్వారా రియల్‌ఎస్టేట్ వ్యాపారి బోగిని జంగయ్యకు సమాచారం వచ్చింది. కూకట్‌పల్లికి చెందిన ఓ పూజారిని తీసుకువచ్చి పూజలు చేయించి దొంగతనం చేయాలనుకున్నారు. కానీ, వీళ్లు ఇచ్చే డబ్బు సరిపోకనో.. మరేదో కారణంచేతనో పూజారి మళ్లీ వారి వద్దకు రాలేదు. దాంతో విజయవాడకు చెందిన రజాక్ అనే క్రిమినల్‌ను సంప్రదించారు. వ్యాపారి తిరుమన తురై వద్ద పనిచేసిన మేనేజర్ నెంబర్ తీసుకొని తనను సంప్రదించి నల్లధనం ఉన్న విషయం నిజమేనని నిర్ధారించుకున్నారు.

గతంలో మోసపోయిన వ్యక్తిని మళ్లీ రంగంలోకి దింపి..

రజాక్ అనే క్రిమినల్ ద్వారా గతంలో మోసపోయిన సతీష్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి గతంలో పోగొట్టుకున్న సొమ్ము తిరిగి సంపాదించుకునేందుకు అ దకాశం వచ్చిందని, వ్యాపారి ఇంటి లోకేషన్ పంపించి రూ.950 కోట్ల నల్ల ధనం ఉందని, దోపిడీ చేయడానికి మనుషులు కావాలని, నీకు కూడా వాటా ఉంటుందని చెప్పాడు. దాంతో సతీష్ జాఖీ లఖానీ అనే వ్యక్తి ద్వారా షైమూద్, సతీష్‌లకు ఉమ్మడి మిత్రుడైన పెద్ది శ్రీనివాస్ కూడా దోపిడీ చేసేందుకు ఒప్పుకున్నాడు. జాఖీ లఖానీ, సవూద్, ఆదిల్, ముదాసీర్, ఖాదర్, అక్బర్, షమీమ్, జాఫర్, ఇస్మాయిల్‌లతో టీమ్ ఏర్పాటు చేసి దోపిడీకి రెక్కీ నిర్వహించారు. ఇంట్లోకి వెళ్లేందుకు ఐరన్ కట్టర్, స్పానర్స్, రెండు ఫైర్‌స్ప్రేలు, డోర్ తాళం పగల గొట్టడానికి ఐరన్ రాడ్‌లు అవసరమైతే ఎదురించిన వారిని హత్య చేసేందుకు కత్తులు, ఇతర ఆయుధాలు కొనుగోలు చేశారు. ఈనెల 4న రాత్రి 1.30 గంటల సమయంలో దోపిడీకి వెళ్లారు. ఇంట్లోకి ప్రవేశించి చూడగా యజమాని కుటుంబం మెలకువతో ఉండగా.. బయట వాచ్‌మ్యాన్ కూడా ఉండటంతో వెనుతిరిగి వచ్చేశారు. ఈనెల 11న తెల్లవారుజామున మరోసారి పథకం వేశారు. ఇద్దరు వాచ్‌మెన్‌లను కొట్టి బెదిరించి చేతులు కట్టేసి ఇంటి చుట్టూ ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేసి 8 మంది గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. నిచ్చెనల సహాయంతో రెండో అంతస్తుకు వెళ్లగా శబ్దంతో ఇంట్లోవారు లేచి సీసీ టీవీలో చూసి ఇంట్లోకి దొంగలు ప్రవేశించినట్లు గుర్తించి డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ప్లాన్

అంతా అనుకున్నట్లు జరిగి తిరుమనతురై ఇంట్లో దోపిడీ చేస్తే.. ప్రజలు, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు సైతం దుండగులు ప్లాన్ వేశారు. దోపిడీ అనంతరం దొంగతనం చేసిన డబ్బులు ఉంచిన స్థలంలో ఫేక్ మనీ తయారుచేసే బ్లాక్ పేపర్స్ బండిల్స్, దానికి అవసరమయ్యే పౌడరు, లిక్విడ్‌లు ఉంచి తిరుమనతురై ఇంట్లో ఫేక్‌మనీ తయారుచేస్తున్నట్లు నమ్మించి పోలీసుల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నించినట్లు డీసీపీ చెప్పారు.



పోలీసుల అదుపులో నిందితులు

మూడోసారి పోలీసులకు చిక్కి..

తిరుమనతురై ఇంట్లో రూ.950 కోట్ల నల్లధనం ఉందని నమ్మి.. రెండుసార్లు దోపిడీకి యత్నించి మూడోసారి ప్లాన్ చేసేందుకు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బేకరీలో సమావేశమైన 15 మంది నిందితులను ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీస్ టీం చాకచక్యంగా పట్టుకొని వారి నుంచి రూ.80వేల నగదుతోపాటు 3 కార్లు, స్కూటీ, 16 సెల్‌ఫోన్లు, 2 ఐరన్ కట్టర్లు, 2 ఫైర్‌స్ప్రేలు, ఇనుప రాడ్లు, 6 ఫేక్‌మనీ బ్లాక్ పేపర్స్ బండిల్స్, ఫేక్ మనీ తయారీ పౌడర్, 20 లీటర్ల రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం ఆదివారం రిమాండ్‌కు తరలించారు. పెద్దఎత్తున దోపిడీకి యత్నించిన దొంగలను కేవలం వారంలోపే అరెస్టు చేసిన ఎస్‌ఎచ్‌వో రాఘవేందర్ రెడ్డి, ఎస్సై కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుల్ కృష్ణ, రవిందర్, ఉపేందర్, శివచంద్ర, సంతోష్‌లతో కూడిన ప్రత్యేక టీమ్‌ను డీసీపీ, ఏసీపీలు అభినందించారు.

అన్నదాతకు 'ఇక్రిశాట్' భరోసా

- ప్లాంటిక్స్ యాప్‌తో మేలు



దౌల్తాబాద్, జూన్ 16: ఆధునిక యుగంలో వ్యవసాయంలో కొత్త హంగులు అద్దుతూ సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్‌లోని అంతర్జాతీయ పంట పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయదారుల కోసం ప్లాంటిక్స్ అనే యాప్‌ను రూపొందించింది. రాష్ట్రం, దేశంలో ఏ మూలన ఉన్నా సరే రైతుల చేతిలో సెల్‌ఫోన్ ఉంటే చాలు పంటలకు చీడపురుగులు, క్రిమికీటకాల బారి నుంచి కాపాడేందుకు రైతులకు భరోసాను ఇస్తూ నీకు నేనున్నాంటూ అరచేతిలోనే సమస్యలకు పరిష్కారం చూపుతోంది. ఈ ప్లాంటిక్స్ యాప్ మొబైల్ ఫోన్ గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో అన్ని పంటలకు సంబంధించిన సస్యరక్షణ చర్యలు, యజమాన్య పద్ధతులు, చీడ పీడలు, తెగుళ్ల నివారణ, పోషకాలు, సమస్యలు, సూచనలు, సలహాలతో రైతులకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు. గతంలో పంట వేసిన అనుభవజ్ఞులైన రైతులు లేదా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకునే వారు. ఇప్పుడు పంటకు పట్టిన చీడ పురుగు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలు తీసి పంపితే చాలు. దాని నివారణకు ఏం చేయాలో యాప్‌లో పూర్తి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఏ పంట సమస్యకైనా పరిష్కారం

రైతులు కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు దినుసులు, అపరాలు లాంటివి పండిస్తారు. ఇప్పటి వరకు ఏపంట పండించినా వాటి సాగు విధానం, సస్యరక్షణ, యజమాన్య పద్ధతులు తదితర వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులు, గాలి తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో వేగం తదితర అన్ని అంశాలను ఇందులో తెలుసుకోవచ్చు.

సమగ్ర సమాచారం

పంటలకు తెగుళ్లు, చీడపీడల విషయంలో ప్లాంటిక్స్ యాప్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆ సమస్యలను నిపుణులకు తెలియజేయడంతో పాటు వాటి పరిష్కారాన్ని పొందే అవకాశం కూడా ఈ యాప్ ద్వారా లభిస్తుంది. తెగుళ్లు, చీడపీడలు సోకిన పంటల ఫొటోలను తీసి పంపితే వెంటనే ఆ పంటకు సోకిన తెగులు ఏంటో వెల్లడిస్తుంది. అంతేకాదు ఆ తెగులుకు వాడాల్సిన మందులనూ సూచిస్తుంది. అవి ఏ మోతాదులో వాడాలో వివరిస్తుంది. యాప్‌లో కమ్యూనిటీ ఆప్షన్‌లోకి వెళ్తే సహచర రైతులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతుల అనుభవాలు, సందేహాలను పంచుకునే అవకాశముంటుంది. ఇదంతా రైతు తాను ఉన్న ప్రదేశం నుంచే చేయవచ్చు. ఇంకా పంట లాభాన్ని అంచనా వేసుకోవచ్చు. తన చుట్టూ ఏఏ ఎరువులు, పురుగు మందుల దుకాణాలు అందుబాటులో ఉన్నాయో కూడా చూయిస్తుంది.

యాప్ అద్భుతంగా ఉంది




పంటలకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్ ఉంటే పంటలకు ఓ వైద్యుడిని వెంట పెట్టుకున్నట్లు ఉంది. పంట పొలాల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదు. ఈ యాప్ రైతులందరికీ చేరితే బాగుంటుంది.

కుమ్మరి నర్సప్ప, రైతు, దేవరఫస్లాబాద్

ప్రమాదకరంగా ఎన్టీఆర్ చౌరస్తా

- విస్తరించాలని పట్టణ ప్రజల విన్నపం



వికారాబాద్, జూన్ 17: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తా ప్రధాన కేంద్రం ఇరుకుగా మారింది. అప్పట్లో రోడ్డు మధ్యలో వేసిన ఎన్టీఆర్ విగ్రహం ఇప్పుడు సమస్యగా మారింది. ఆ చౌరస్తాలో ఏ దిక్కు నుంచి ఏవాహనం వస్తుందనేది దగ్గరకు వచ్చే వరకు తెలియని విధంగా మారింది. విగ్రహం కట్ట పెద్దగా ఉండడం ముందు వచ్చే వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్టీఆర్ చౌరస్తా నుండి తాండూరు, హైదరాబాద్ వెళ్లేందుకు మార్గాలు ఉండగా ఆ దారి గుండా వెళ్లే వారే ఎక్కువ. అదే సమయంలో ఈ దారి గుండానే విద్యార్థులు, ఉద్యోగాలు స్కూల్, కళాశాల, కార్యాలయాలకు వెళుతుంటారు. ఈ దారి గుండానే పెద్ద పెద్ద లారీలు కూడా వెళుతుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఎన్టీఆర్ విగ్రహం కొంత పక్కకు జరిపి చౌరస్తాను కొంత విస్తరిస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఈ దిశగా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శివప్రసాద్

ఎమ్మెల్యే యాదయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, జూన్ 16 : అమెరికాలోని తానా సభలకు హాజరై తిరిగి ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్యను బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఈ మేరకు ఆదివారం నవాబ్‌పేట్ మండల పరిధిలోని చించల్‌పేట్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన్ను చేవెళ్ల వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పి.హన్మంత్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.నర్సింలు, పలువురు బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మొయినాబాద్, జూన్ 16 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని సజ్జన్‌పల్లి గ్రామంలో మండల కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగయ్య మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అజీజ్‌నగర్ గ్రామంలో ఇటీవల ఏఐటీయూసీ జెండాను



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

కూల్చిన దుండగులను వెంటను అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల మంజుల, నాయకులు రఘునారాయణ. వెంకటయ్య, ఎండీ జలీల్, సత్యనారాయణగౌడ్, జహంగీర్, శ్యాంసుందర్, మంగళి నర్సింలు, కె.రాములు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విశ్వసించిన ప్రజలు

● ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి



వంశీచంద్ రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, జూన్ 16: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చాయని, దేశ ప్రజలు పార్టీని విశ్వసించారని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి పక్షాలు సమర్థవంతంగా పనిచేశాయని, ఇదే ఒరవడిని పార్లమెంట్‌లోనూ, పార్లమెంట్ బయట కొనసాగిస్తాయని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో ఆదివారం వంశీచంద్‌రెడ్డి పర్యటించారు. ఆయా మండల కేంద్రాలలోని కాంగ్రెస్ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించారు. పార్టీ శ్రేణుల యోగక్షేమాలు అడిగి తెలుసుకొని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. ఈ సదర్భంగా వంశీచంద్‌ను నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వంశీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు దేశ ప్రజలంత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీని మరింత అగ్రస్థానానికి తీసుకుపోయేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. దేశంలో బీజేపీ క్రమంగా బలహీన పడుతుందని, అందుకు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని, అందుకే ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. ఆరు గ్యారంటీ పథకాల అమలు ద్వారా పేద ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, భవిష్యత్తుపై భరోసా ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలను కాంగ్రెస్ శ్రేణులు ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకొని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలని పిలుపు నిచ్చారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, విజయ్ కుమార్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, భగవాన్‌రెడ్డి, మండలాధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, వస్పుల మానయ్య, డోకూరు ప్రభాకర్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జిల్లా, మండల నాయకులు కృష్ణనాయక్, జంతుక యాదయ్య, గండికోట మల్లేశ్, కాలే మల్లయ్య, వాటర్ బాబా, వస్పుల శ్రీశైలం, ఫరీద్, వస్పుల శ్రీకాంత్, మహేశ్, అజీం, రాజశేఖర్, రవీందర్ యాదవ్, రామకృష్ణ, లక్‌పతి నాయక్, రామకృష్ణ, శంకర్, సురేశ్ నాయక్, ఖాదర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి : సబితారెడ్డి

కందుకూరు, జూన్ 16: ఎల్లవేళలా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని మహేశ్వరం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన కొమ్మగళ్ళ జ్యోతి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.లక్షా20 వేల ఎల్వోసీని సబితారెడ్డి మంజూరు చేయించింది. ఈమేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గం ప్రజల సంక్షేమానికి తాను ప్రతి నిత్యం ముందుండి పనిచేస్తానని అన్నారు.



ఎల్వోసీ అందజేస్తున్న సబితాఇంద్రారెడ్డి

ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్ రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కేజీ రెడ్డి కళాశాల వార్షికోత్సవం



లింబాద్రికి జ్ఞాపిక అందిస్తున్న యాజమాన్యం

మొయినాబాద్, జూన్ 16 : మండల పరిధిలోని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధ్యక్షుడు, ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీరెడ్డి విద్యాసంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యాసంస్థ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేజీరెడ్డి కళాశాల డైరెక్టర్ డాక్టర్ రోహిత్ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బన్సీలాల్



వీరేంద్ర కుమార్‌ను సన్మానిస్తున్న బన్సీలాల్

ఆమనగల్లు, జూన్ 16: తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ, బయోడీజిల్ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు మల్కేడి బన్సీలాల్ ఆదివారం కేంద్రం మంత్రి వీరంద్ర కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పూలమాలశాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పర్యావరణ పరిరక్షణ, బయోడీజిల్ అభివృద్ధి సంస్థ ద్వారా తెలంగాణలో చేపడుతున్న కార్యక్రమాలను కేంద్రమంత్రికి వివరించినట్లు బన్సీలాల్ తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ద్వారా సహకారం అందించినట్లు కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

చేవెళ్ల ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి కృషి

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

చేవెళ్ల, జూన్ 16 : చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి అగ్ని ప్రమాదానికి గల కారణాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. వంద పడకల ఆసుపత్రిగా మార్చే విషయాన్ని సైతం మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. డయాలసిస్ రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్యులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ జరిగిన వెంటనే ఫైర్, పోలీసులు స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మీ రమణారెడ్డి, ఎంపీటీసీ రాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, డీసీసీ ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పాండుయాదవ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్, నాయకులు మాణిక్యం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న భీంభరత్, తదితరులు



గోతుల్లో మట్టిపోసి చదును చేయిస్తున్న యాట నర్సింహ

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కడ్తాల్, జూన్ 16: కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు. కడ్తాల మండలం మక్తమాదారం- నేదునూరు రోడ్డు ఇటీవల కరిసిన వర్షాలకు గోతులేర్పడి వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు సైతం ఇబ్బందులు కలుగుతున్నాయి. స్పందించిన యాట నర్సింహ జేసీబీతో రోడ్డుపై గోతుల్లో మట్టి పోసి పూడ్చి వేయించారు. మక్తమాదారం-నేదునూరు రోడ్డు బీటీ నిర్మాణం గురించి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని నర్సింహ తెలిపారు. నాయకులు నారాయణ, షాబోద్దీన్, నర్సింహ, దన్‌రాజ్, కృష్ణ, తదిరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



ఆర్థిక సాయం అందజేస్తున్న జర్పుల దశరథ్ నాయక్

కడ్తాల్, జూన్ 16: పేదలకు, వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. కష్టాల్లో ఉన్న పేదలకు ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించి ఆపద సమయంలో మనోధైర్యాన్ని కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం దశరథ్ నాయక్ పర్యటించారు. కాలనీలలో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. అనారోగ్యంతో చనిపోయిన పోతుగల్ల పద్మ, బండి జయమ్మ కుటుంబాలను ఆయన పరామర్శించారు. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. అధైర్య పడవద్దని బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని కల్పించారు. సేవా కార్యక్రమాలలో తానేప్పుడు ముందుంటానని అన్నారు. నాయకులు మంగళపల్లి నర్సింహ, రాంచంద్రయ్య, అంజి, శ్రీకాంత్, మహేశ్, వెంకటేశ్, శివ, శ్రీను, జంగయ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

-ఆమనగల్లు, జూన్ 16: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశనుంచే విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఆయన కోరారు. కోట్ర గ్రామంలో కరాటే మాస్టర్ నీరటి కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గోలి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పొందిన విద్యార్థులకు కరాటే బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కరాటే సాధన ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ప్రతిభ ఆదారంగానే ఏ రంగంలోనైన గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి గుర్తింపు పొందాలన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మాస్టర్ కుమార్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రరావు, నాగరాజుగౌడ్, శివరాణి, ఆంజనేయులు, వెంకటయ్య, సహదేవ్, చలిచీమల సతీష్, తదితరులు పాల్గొన్నారు.



కరాటే విద్యార్థులతో గోలి శ్రీనివాస్ రెడ్డి

రేపటి నుంచి అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

శంకర్‌పల్లి, జూన్ 16: రేపు(మంగళవారం) అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనా ప్రథవ వార్షికోత్సవాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శంకర్‌పల్లి అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఆదివారం తెలిపారు. మంగళవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమై 19వ తేదీన రాత్రి అల్పాహారంతో పూజా, వివిధ కార్యక్రమాలు ముగుస్తాయని సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కందుకూరు/షాబాద్ : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

షాబాద్/కందుకూరు, జూన్ 16 : షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం హైతాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 20 ఏళ్ల తరువాత కలుసుకొని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. చిన్నతనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికీ మరిచిపోనిదని, విడదీయరానిదని గుర్తుచేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినవారు ఒక్కచోటికి రావడం ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కందుకూరు మండలంలోని రాచులూరు ఉన్నత పాఠశాలలో 2004-2005 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి కల్యాణ మండపంలో సమ్మేళనం నిర్వహించారు. వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. నాయకులు అంజయ్య, కృష్ణ, నర్సింహ, పాండురంగారెడ్డి, లక్ష్మీనారాయణ, లతామంగేష్కర్, శ్రీదేవి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తలకొండపల్లి : మండల పరిధిలోని మెదక్‌పల్లికి చెందిన దరువుల కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారిలో నాయకులు విష్ణుగౌడ్, వెంకట్ రెడ్డి, చంద్రమౌళి, రాములు, తదితరులు ఉన్నారు.

కడ్తాల్ : కడ్తాల మండల కేంద్రానికి చెందిన ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు షాబోద్దీన్ తండ్రి శంషోద్దీన్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వంశీ చంద్‌రెడ్డి ఆదివారం శంషోద్దీన్ ఇంటికి చేరుకొని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ఏడీ

కడ్తాల్, జూన్ 16: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి ఆదివారం కడ్తాల మండలం మైసిగండి మైసమ్మను దర్శించుకున్నారు. మైసమ్మకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సర్వేశ్వర్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలందజేసి సత్కరించారు. అంతకు ముందు ఏటీడీఏ వెంకటయ్య, హెచ్‌డబ్ల్యూవోలు అడిషనల్ డైరెక్టర్‌కు స్వాగతం పలికారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య, బడిబాట కార్యక్రమం, పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు బల్‌రామ్, రాములు, రామచంద్రయ్య ఉన్నారు.



మైసమ్మ ఆలయంలో పూజలు చేసిన అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి

క్రైం కార్నర్

రెండు బైకులు ఢీ.. ఒకరు దుర్మరణం

● మరొకరి పరిస్థితి విషమం.. ముగ్గురికి గాయాలు

ఆమనగల్లు, జూన్ 16: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆమనగల్లు పట్టణ సమీపంలోని ఆమనగల్లు-మాడ్గుల ప్రధాన రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం వద్ద ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసు, స్థానికుల కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాఘాయిపల్లి గ్రామానికి చెందిన రాయకంటి యాదగిరి అజిలాపూర్ గ్రామంలోని బొడ్రాయి ఉత్సవాలకు తన బావ సల్వాజీ యాదయ్య ఇంటికి వెళ్లాడు. రెండురోజుల పండుగ ముగియడంతో ఆదివారం రాయకంటి యాదగిరిని బైక్‌పై ఎక్కించుకొని సల్వాజీ యాదయ్య రాఘాయిపల్లికి బయలు దేరారు. అదే సమయంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన లండం శివ పల్సర్ బైక్‌పై జూనియర్ కళాశాల మైదానం నుంచి రోడ్డుపైకి వస్తున్నాడు. ఈక్రమంలో అజిలాపూర్ నుంచి బైక్‌పై అతివేగంగా వస్తున్న సల్వాజీ యాదయ్యను రోడ్డుపైకి వస్తున్న లండం శివ బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. రోడ్డుపై పడ్డ బైక్ తీవ్రతకు ఆమనగల్లు నుంచి కూరగాయలు తీసుకొని ఎర్రబీక్య తండాకు బైక్‌పై వెళ్తున్న ఇస్లావత్ రోజాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజిలాపూర్ నుంచి వస్తున్న బైక్‌పై ఉన్న సల్వాజీ యాదయ్య(45) అక్కడికక్కడే మృతిచెందాడు. అదే బైక్‌పై ఉన్న రాగాయిపల్లి గ్రామానికి చెందిన రాయకంటి యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈప్రమాదంలో మరో రెండు బైక్‌లపై ఉన్న ఆమనగల్లుకు చెందిన లండం శివ, ఎర్రబీక్య తండాకు చెందిన ఇస్లావత్ రోజాలు స్వల్పంగా గాయపడ్డారు. యాదగిరిని వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యాదయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ రోజా, లండం శివలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రామ్ నాయక్ తెలిపారు.

ఎస్వోటీ దాడులు.. 10 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

కొందుర్గు, జూన్ 16: మండల కేంద్రంలో అక్రమంగా నిలువ ఉంచిన 10 గ్యాస్ సిలిండర్లను ఆదివారం దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఎస్వోటీ ఎస్సై తరుణ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన శంకర్ ఇంట్లో 6 ఖాళీ సిలిండర్లు, మరో 4 నిండు సిలిండర్లను పట్టుకొని, స్థానిక పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్సై వివరించారు. ఈ విషయమై షాద్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ డీలర్ భరత్‌ను వివరణ కోరగా.. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కొందుర్గులో సఖి పథకంలో భాగంగా మహిళా సంఘం సభ్యురాలికి పంపిణీ బాధ్యతలు ఇచ్చి, స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశామని, దానికి సంబంధించిన లైసెన్స్ తమ వద్ద ఉందన్నారు. సోమవారం లైసెన్స్‌ను అందజేస్తామని తెలిపారు.

బెల్లం పానకం ధ్వంసం.. నాటుసారా స్వాధీనం

ఆమనగల్లు, జూన్ 16: ఆమనగల్లు ఎక్సైజ్ పరిధిలోని కడ్తాల, మాడ్గుల, ఆమనగల్లు మండలాల పరిధిలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. పల్లెచెల్కతండాలో సబావత్ లస్కర్ వద్ద రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. నాగిళ్ల, ముద్విన్, ఎక్వాయ్‌పల్లి గ్రామాల్లో దాడులు చేశారు. ఎక్సైజ్ సీఐ బద్యాచౌహన్ మాట్లాడుతూ తెలంగాణను నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అక్రమంగా నాటుసారా క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాటుసారా క్రయ విక్రయాలపై తమకు సమాచారమందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సైలు స్వప్న, శంకర్, సిబ్బంది ఉన్నారు.

మహిళ బ్యాగులో నుంచి బంగారం అపహరణ

షాద్‌నగర్ రూరల్, జూన్ 16: ఇంట్లో నిర్వహించే మనుమరాలి ఫంక్షన్ సందర్భంగా తులం బంగారం పెడుదామని అనుకుంది ఆ మహిళ. కానీ ఇంతలో బ్యాగులో ఉన్న బంగారం అపహరణకు గురవ్వడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యింది. బాధితురాలి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం సూరారం గ్రామానికి చెందిన భారతమ్మ ఆదివారం షాద్‌నగర్‌లో జరిగే మనుమరాలు ఫంక్షన్‌కు వచ్చింది, లేడీస్ కార్నర్ అనే షాపులో కొన్ని వస్తువులు కొనుగోలు చేసేందుకు వెళ్లింది. ఇంతలో ఆమెను అనుసరిస్తూ షాప్‌లోకి వచ్చిన ఇద్దరు మహిళలు ఆమె బ్యాగులోని నుంచి తులం బంగారాన్ని అపహరించుకుపోయారు. కొద్దిసేపటి తర్వాత ఆమె బ్యాగును పరిశీలించగా అందులో బంగారం కనిపించలేదు. అయితే, షాపులోని సీసీ కెమెరాల్లో బంగారం అపహరించిన అనుమానిత మహిళల దృశ్యాలు నమోదయ్యాయి.

బాణామతి నెపంతో మహిళపై దాడి

● 9 మందిపై కేసు.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో ఘటన

చౌదరిగూడ, జూన్ 16: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాలలో ఓ మహిళ బాణామతి చేస్తుందనే నెపంతో చెట్టుకు కట్టేసి కొట్టిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితురాలు పద్మమ్మ ఫిర్యాదు మేరకు జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు దాడికి పాల్పడిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఆదివారం ఎస్సై సక్రం తెలిపిన వివరాల ప్రకారం.. రావిర్యాల గ్రామానికి చెందిన పద్మమ్మ శ్మశానం నుంచి బూడిద తీసుకొని వచ్చి గ్రామలో చెట్లపై చల్లినట్లు నటిస్తూ పక్క ఇళ్లపై చల్లుతోందని గ్రామస్తులు గమనించి చెట్టుకు కట్టేసి కొట్టారని తెలిపారు. ఈమేరకు ఆమెపై దాడి చేసిన 9మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సక్రం తెలిపారు. చేతబడి, బాణామతి అనేవి మూఢనమ్మకాలని, అలాంటి వదంతులు నమ్మవద్దని, ఎవరైనా అలాంటి పుకార్లు సృష్టించనట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అదించాలని ఎస్సై తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



5కే రన్‌ను ప్రారంభిస్తున్న శారద, గీతా భాస్కర్

శంకర్‌పల్లి, జూన్ 16: మహిళా సాధికారతకు ప్రతీ ఒక్కరు చేయూతనివ్వాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థానంలో నిలవాలని ప్రముఖ సినీ దర్శకుడు తరుణ్ భాస్కర్ తల్లి, నటి గీతాభాస్కర్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు శారద నేరేళ్లలు అన్నారు. మండల పరిధిలోని మోకిలలో గల పీజీ హిల్స్‌లో ఆదివారం గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మోకిల శారీథాన్ సెకండ్ ఎడిషన్ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా భాస్కర్, శారదా నేరేళ్ల, భవానీలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 5కే, 3కే రన్‌లను జెండా ఊపి ప్రారంభించారు. మహిళలు జుంబా డ్యాన్స్, యోగా తదితర కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఆరోగ్యం శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలకు తోడ్పాటునందిస్తున్న వనిత చేయూత సంస్థ చైర్మన్ వాణిని వారు ప్రత్యేకంగా అభినందించారు. ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన వస్తువులతో మహిళలు స్టాళ్ల ఏర్పాటు చేయగా పలువురు కొనుగోలు చేశారు.

ఇబ్రహీంపట్నం డివిజన్ కుమ్మర సంఘం అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్



యాచారం, జూన్ 16 : ఇబ్రహీంపట్నం డివిజన్ కుమ్మర సంఘం అధ్యక్షుడిగా యాచారం మండల కేంద్రానికి చెందిన కొండాపురం శ్రవణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ కుమ్మర కుల వృత్తి పరిరక్షణకు పోరాటం చేస్తానని, తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించారని, అంకిత భావంతో పని చేస్తానన్నారు. రాష్ట్ర నాయకులు డా.శంకర్, డా.జయశంకర్, కృష్ణలకు ధన్యవాదాలు తెలిపారు.